నమస్తే తెలంగాణ
# సూర్యాపేట
5 | ఖమ్మం, బుధవారం 4 జూన్ 2025 | SURYAPET

## భవిత కేంద్రం నిర్మాణ పనుల పరిశీలన


ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో భవిత కేంద్రం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ రూరల్, జూన్ 3: నల్లగొండ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో చేపడుతున్న భవిత కేంద్రం నిర్మాణ పనులను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం భవిత కేంద్రాల్లో తప్పనిసరిగా ర్యాంపు, రెయిలింగ్, టాయిలెట్లు, తాగునీరు వంటి కనీస వసతులు ఉండేలా చూడాలన్నారు. ఆక్టివ్ రూమ్‌కు ప్రాధాన్యమివ్వాలని, భవిత కేంద్రాలు సద్వినియోగమయ్యేలా నిర్మాణాలు చేపట్టాలని ఏఈ రాజేశ్‌కు సూచించారు. ఆమె వెంట ఆర్డీవో అశోక్‌రెడ్డి, ఎంపీడీవో వెంకట్‌రెడ్డి ఉన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట ఎస్పీ నరసింహ



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

## రెగ్యులర్ చేసిన బీఆర్ఎస్
# కక్షగట్టిన కాంగ్రెస్ సర్కార్

### కేసీఆర్ చొరవతో 258మంది రెగ్యులర్..

**జూనియర్ అధ్యాపకులపై వివక్ష • ఇంక్రిమెంట్లు ఆపిన వైనం**

**నల్లబ్యాడ్జీలతో నిరసన.. డీఐఈవోకు వినతి**

**స్పందించని అధికారులు • రగులుతున్న ఇంక్రిమెంట్ల రగడ..!**

ఏండ్ల తరబడి కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్న వారిని బీఆర్ఎస్ ప్రభుత్వం రెగ్యులర్ చేసింది. అప్పటి సీఎం కేసీఆర్ మే 2023లో వీరందరినీ రెగ్యులర్ చేసి సర్కార్ ఉద్యోగులుగా ఆమోద ముద్రవేశారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 33 ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో పనిచేస్తున్న 258 మంది కాంట్రాక్టు అధ్యాపకులు రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులయ్యారు. వారి కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. కానీ.. సంతోషం ఎంతో కాలం నిలువలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండో దఫా రావాల్సిన ఇంక్రిమెంట్లు నిలిపివేశారు.

రామగిరి, జూన్ 3: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్న వారిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెగ్యులర్ చేసింది. తెలంగాణ ఏర్పాటుకు ముందు వీరిని పట్టించుకున్న నాయకులు, సర్కార్ లేదు. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత వీరి వేతనాలు రూ. 18వేల నుంచి రూ. 27వేలకు పెంచారు. ఆ తర్వాత రూ.37, 100 పెంచారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అప్పటి సీఎం కేసీఆర్ మే 3, 2023న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేశారు. వీరందరికీ గత సంవత్సరం(మే 2024)లో తొలి ఇంక్రిమెంట్ అందింది. అయితే రెండవ ఏడాది మే. 2025లో సహజంగా రావాల్సిన ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా కాంగ్రెస్ సర్కార్ అడ్డుకుంటున్నదని అధ్యాపకులు ఆరోపిస్తున్నారు.

### ప్రిన్సిపాళ్ల నిర్లక్ష్యం..

రెగ్యులర్ అధ్యాపకులకు ప్రతి సంవత్సరం సహజంగా ఇంక్రిమెంట్లు వేస్తూ ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు వేతనం చేయాలి. కాని ఇంటర్మీడియట్ బోర్డు, డీఐఈవోల నుంచి ఎలాంటి ఆదేశాలు లేనప్పటికీ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఇంక్రిమెంట్లు మంజూరు చేయలేదు. బీఆర్ఎస్ సర్కార్ రెగ్యులర్ చేసిన అధ్యాపకులు ప్రొబేషనరీ పూర్తి చేసినప్పటికీ 2వ ఇంక్రిమెంట్లు చేయకుండా ఇబ్బందులు పెడుతూ నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నల్లబ్యాడ్జీలతో నిరసన..**

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల స్పాట్ వ్యాల్యుయేషన్ కేంద్రంలో నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన తెలియజేశారు. పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కారం చేయని పక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

# బీమా ఏది?

## రైతు, చేనేత బీమా పథకాల కోసం ఎదురుచూపులే..

- దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా అందని వైనం
- 100 రైతు బీమా.. 35 చేనేత అప్లికేషన్లు పెండింగ్
- రూ. 5లక్షల సాయం కోసం బాధితుల నిరీక్షణ
- పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- బీఆర్ఎస్ హయాంలో పది రోజుల్లోనే ఖాతాల్లో జమ
- కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్న ప్రజలు

కుటుంబ పెద్ద చనిపోతే..ఆ ఫ్యామిలీ రోడ్డున పడవద్దని నాటి బీఆర్ఎస్ సర్కారు బీమా పథకాలకు శ్రీకారం చుట్టింది. కుటుంబంలోని భార్యాపిల్లలకు ఆసరాగా ఉండాలని భావించింది. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుబీమా, చేనేత బీమా పథకాలు అమలు చేసి చూపించింది. అలాంటి పథకాలకు కాంగ్రెస్ హయాంలో లబ్ధిదారులకు అందని ద్రాక్షలా మారాయి. రూ. 5లక్షల సాయం కోసం దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా డబ్బులు జమ కాకపోవడంతో లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.





యాదాద్రి భువనగిరి, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు తీసుకొచ్చారు. అందులో రైతుబీమా ఒకటి. రైతు మరణిస్తే బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకానికి నాంది పలికింది. ఏ కారణంతోనైనా రైతు చనిపోతే నామినీకి రూ. 5లక్షల బీమా పరిహారం అందుతుంది. అన్నదాతకు ఎలాంటి భారం పడకుండా ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుంది. 18 ఏండ్ల నుంచి 59 సంవత్సరాల వయసున్న రైతులందరూ అర్హులే. పట్టాదారు పాస్ పుస్తకాలున్న ప్రతి రైతుకూ బీమా పథకం వర్తిస్తుంది. జిల్లాలో సుమారు 2.30లక్షల మంది రైతులు ఉన్నారు. అయితే కొంత కాలంగా బీమా డబ్బులు సకాలంలో జమ కావడంలేదు. అన్ని దరఖాస్తులు సక్రమంగానే సమర్పించినా నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో 100కి పైగా దరఖాస్తు దారులకు సాయం అందాల్సి ఉన్నది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రీమియం సరిగా చెల్లించకపోవడంతో ఈ చిక్కులు వచ్చినట్లు తెలుస్తున్నది.

### చేనేతకు భద్రతేదీ..?

వ్యవసాయ రంగం తర్వాత పెద్ద పరిశ్రమ చేనేత. రైతు బీమా తరహాలోనే నేత కార్మికుల కోసం కేసీఆర్ సర్కారు సరికొత్త కార్యక్రమానికి పురుడుపోసింది. నేతన్నలకు భరోసా కల్పించాలని జాతీయ చేనేత దినోత్సవం రోజున నేతన్న బీమా పథకాన్ని ప్రారంభించింది. నేత కార్మికుడు దురదృష్టవశాత్తు చనిపోతే ఆయన కుటుంబానికి రూ. 5లక్షల సాయం అందుతుంది. ప్రీమియం సర్కారే చెల్లిస్తుండగా, ఎల్ఐసీతో ఒప్పందం కుదుర్చుకుంది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ పథకానికి తెలంగాణ నేతన్నకు భద్రత అనే కొత్త పేరును పెట్టింది. దీని కింద జిల్లాలో 10,686 మంది నమోదు చేసుకోగా, ఇందులో 9,743మంది చేనేత కార్మికులు, 943 మరమగ్గాల కార్మికులు ఉన్నారు. జిల్లాలో ప్రస్తుతం 35 బీమా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

### కేసీఆర్ హయాంలో పదిరోజుల్లోనే బీమా డబ్బు



పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులు, నేతన్నల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ఇప్పుడు అందరూ గుర్తు చేసుకుంటున్నారు. సకాలంలో పెట్టుబడి సాయం అందించడంతోపాటు రైతు చనిపోతే వారం, పది రోజుల్లోనే సదరు కుటుంబానికి నామినీ డబ్బులు అందేలా చర్యలు తీసుకున్నారు. ఎప్పటికప్పుడు ప్రీమియం చెల్లించేవారు. కానీ ఇప్పుడు సీన్ రివర్సయ్యింది. వారం, పది రోజులు దేవుడెరుగు.. ఏడాదైనా సాయం అందక రైతు కుటుంబాలు అరిగోస పడుతున్నాయి. ఇక నేతన్నలదీ అదే పరిస్థితి దాపురించింది. ఇంటి పెద్ద చనిపోతే బక్కచిక్కిన కుటుంబాలకు రూ. 5లక్షల సాయం అందితే ఎంతో సంబుర పడేవి. పిల్లల పెండ్లిళ్లు, చదువుల కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసేవి. అసలు బీమా డబ్బులే రాకపోవడంతో కాంగ్రెస్ సర్కారుపై దుమ్మెత్తి పోస్తున్నారు.

#### నకిలీ విత్తనాల తయారీదారు
# గుట్టు రట్టు
### తయారీ పరికరాలు సీజ్
### ముగ్గురు నిందితుల అరెస్టు

సూర్యాపేట టౌన్, జూన్ 3: నకిలీ విత్తనాలు తయారు చేస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. ఈ మేరకు మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పట్టణానికి చెందిన సింగారపు యాదగిరి తిరుమలగిరి శివారులోని తన భూమి చుట్టూ ఉన్న వారి భూములు కౌలుకు తీసుకుని పత్తి పంట సాగు చేస్తున్నాడు. పత్తి నుంచి గింజలు వేరు చేసి వాటిని పత్తి విత్తనాలు తయారు చేయవచ్చని యూట్యూబ్‌లో చూసి తెలుసుకున్నాడు. ఒరిజినల్ బీటీ 111 విత్తనాలు అని నమ్మించాలని ఆలోచన చేశాడు. నకిలీ పత్తి విత్తనాల తయారీకి కావాల్సిన సామగ్రి 3 ఫేజ్ ఆఫ్ హెచ్‌పీ మోటర్, దాన్ని కలపడానికి డ్రమ్ములు, సల్ఫ్యూరిక్ యాసిడ్ క్యాన్లు, పత్తి గింజల రంగు రావడానికి సైన్‌స్టార్ డబ్బాలు తీసుకువచ్చాడు. లీజుకు తీసుకున్న వ్యవసాయ భూమి వద్ద సుమారు రూ.4,62,000 విలువైన 308 కిలోల నకిలీ పత్తి విత్తనాలు తయారు చేశాడు. నందాపురంకు చెందిన నవీన్, చిర్రగూడూరుకు చెందిన సోమ నారాయణను కలిసి ఒక ప్యాకెట్ రూ.1,500లకు 10 కిలోల చొప్పున ఇద్దరికి విక్రయించాడు. వాళ్లను ఎక్కువ ధరకు అమ్ముకోమని సలహా ఇచ్చాడు. నవీన్‌కు మరో 50 కిలోలు, సోమ నారాయణకు 40 కిలోల నకిలీ విత్తనాలు అమ్మాడు. పక్కా సమాచారంతో తిరుమలగిరి పోలీసులు నకిలీ పత్తి విత్తనాలతో పాటు పరికరాలు స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్ఐ హరికృష్ణ, ఏఎస్ఐ వెంకన్న, హెడ్ కానిస్టేబుళ్లు విద్యాసాగర్‌రావు, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కరుణాకర్, కానిస్టేబుల్ తదితరులు ఉన్నారు.





# భూభారతికి.. సమస్యల హారతి

## సమస్యల పరిష్కారంపై నీలినీడలు

- మాడ్యూల్స్ ఆరు చేసినా.. ఆప్షన్లు ధరణి లోనివి ముప్పైమూడే
- రెవెన్యూ శాఖకు హెక్టిక్‌గా మారిన పైలెట్ మండలాలు
- నోటీసులు ఇచ్చినా విచారణకు ముందుకురాని రైతులు
- తొలిరోజు మిస్సింగ్ సర్వే నెంబర్లు, ఎక్స్‌టెంట్ కరెక్షన్ దరఖాస్తులే అధికం

సూర్యాపేట, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : గతంలో 33 మాడ్యూల్స్‌తో ఉన్న ధరణికి ప్రత్యామ్నాయంగా, ఆరు మాడ్యూల్స్‌తో భూభారతిని తెచ్చినా అందులో మళ్లీ 33ఆప్షన్లు కనిపిస్తున్నాయి. గతంలో భూ వివాదాలు, సమస్యలు ఉంటే సివిల్ కోర్టుకు వెళ్లేవారు కాగా భూభారతితో ఆర్డీఓ, జేసీ, కలెక్టర్లకు అప్పిలేట్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. దీంతో ధరణి, భూ భారతికి ఎలాంటి తేడాలేదని స్పష్టమవుతున్నది.

ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన మండలాలతో పాటు తొలిరోజు రెవెన్యూ సదస్సులో దాదాపు 70 శాతం వరకు మిస్సింగ్, పెండింగ్ మ్యుటేషన్లు వచ్చాయి. పైలెట్ ప్రాజెక్టు మండలాల్లో మిస్సింగ్ సర్వే నెంబర్లు, పెండింగ్ మ్యుటేషన్ల సమస్య పరిష్కరించేందుకు ఆయా సర్వే నెంబర్లలో ఉన్న రైతులు సహకరించడంలేదు.

బీఆర్ఎస్ హయాంలో భూసమస్యల పరిష్కారం కోసం ధరణి పోర్టల్ తీసుకువచ్చింది. దాదాపు 98శాతం రైతుల రికార్డులు ఆన్‌లైన్ చేయడంతో పాటు పక్కా పాస్ పుస్తకాలు వచ్చాయి. మిగిలిన రెండు శాతం మాత్రం కోర్టు కేసులు, వ్యక్తిగత పంచాయితీలు తదితర కారణాలతో నిలిచిపోయాయి. వాటిని కూడా పరిష్కరించాల్సి ఉండగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ధరణి స్థానంలో పేరు మార్చి భూభారతిని తీసుకువచ్చింది.

### భూభారతితో ఒరిగేది శూన్యం

ఇప్పటి వరకు ఉన్న ధరణి స్థానంలో వచ్చిన భూభారతితో రైతులకు అదనంగా ఒరిగేది శూన్యమని తెలుస్తున్నది. వందలాది సంవత్సరాల నుంచి ఉన్న రికార్డులతో పాటు, ఉమ్మడి రాష్ట్రంలో రెవెన్యూ అధికారుల లీలలతో ఇష్టారాజ్యంగా రికార్డులు ఉండడంతో ధరణితో ఆన్‌లైన్ చేయడానికే అనేక సమస్యలు వచ్చాయి. వాటిని ఎప్పటికప్పుడు మాడ్యూల్స్ తెచ్చారు. ప్రభుత్వం సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కరించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తుండగా తొలిరోజు అత్యధికంగా మిస్సింగ్ సర్వే నెంబర్లకు సంబంధించినవే 70శాతం వరకు ఉన్నాయి. మిగిలిన 30 శాతంలో పేరు మార్పిడీ, ఇనాం భూములకు పట్టాచేయాలని, సాదాబైనామాలు, లావుని పట్టాల మార్పిడీలపై దరఖాస్తులు వస్తున్నాయి. గత మే నెల 5న జిల్లాలోని గరిడేపల్లి మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోగా మండల వ్యాప్తంగా 1,690 దరఖాస్తులు వస్తే కేవలం 65 మాత్రమే డిస్పోజ్ అయ్యాయి. మిగిలిన వాటిలో 912 దరఖాస్తులు మిస్సింగ్ సర్వే నెంబర్లు ఉండగా మిగిలినవి సాదాబైనామాలు, ప్రభుత్వ భూములు, లావని పట్టాలకు సంబంధించినవే. అలాగే ఆత్మకూర్.ఎస్ మండలంలోని ఏనుబాముల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సాదాబైనామాలకు సంబంధించి 95 దరఖాస్తులు రాగా మిస్సింగ్ సర్వే నెంబర్లు 10, మూడు వారసత్వ భూముల దరఖాస్తులు అందాయి.

### నోటీసులే తీసుకోవడం లేదు

మిస్సింగ్ సర్వే నెంబర్ల దరఖాస్తులు పరిష్కరించేందుకు ఆయా సర్వేనెంబర్లలో ఉన్న రైతుల నుంచి సహకారం అందడం లేదని, నోటీసులు ఇచ్చేందుకు వెళితే తీసుకోవడం లేదని రెవెన్యూ అధికారుల ద్వారా తెలిసింది. అలా కాకుండా పహాణీలు పరిశీలిద్దామనుకుంటే సరిగా లేకపోవడంతో అనేక చిక్కులు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. రైతులు ఏండ్ల తరబడి తాము ఉన్న భూమి తమది కాదు... వేరే చోటకు వెళ్లాలని చెబుతారని రైతులు భయాందోళన చెందడం... కొన్నిసార్లు రైతుల మధ్య ఘర్షణలకు తావిస్తున్నది. దీంతో మిస్సింగ్ సర్వే నెంబర్ దరఖాస్తులకు ఆయా సర్వే నెంబర్లలో ఎక్స్‌టెంట్ లేక అధికారులు, ఉద్యోగులు ఏమి చేయోలా అర్థం కావడం లేదు. ఈ లెక్కన ధరణిని భూభారతిగా పేరు మార్చినా ఎలాంటి లాభం లేదని తెలుస్తున్నది. ధరణితో 98శాతం పూర్తి కాగా మిగిలిన రెండు శాతాన్ని కూడా ఏమైనా చేయవచ్చా అనేది ఆలోచన చేయకుండా ఏదో కొత్తగా సాధిస్తున్నట్లు పాత ఆప్షన్లతోటే భూభారతి తీసుకువచ్చారు.

#### చూడు చూడు.. దవాఖాన తీరు..
# పడకేసిన పారిశుధ్యం



నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానలో పారిశుధ్యం పడకేసింది. ఆవరణలో ఎటుచూసినా అపరిశుభ్రతే దర్శనమిస్తున్నది. పందులు స్వైర విహారం చేస్తున్నాయి. వానకాలం ప్రారంభమవుతున్న తరుణంలో కొవిడ్ కేసులు పెరుగుతుండడంతో దవాఖానకు వచ్చే రోగులు, గర్భిణులు, వారి బంధువులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మాతా, శిశు సంరక్షణ కేంద్రం ఎదుటే చెత్త డబ్బా ఏర్పాటు చేయడంతో చెత్తాచెదారంలో పందుల గుంపు విచ్చలవిడిగా తిరుగుతున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ, జూన్ 3

